క్లుప్తంగా

ప్రభుత్వ పాఠశాల తనిఖీ

టేకులపల్లి: రోళ్లపాడు గ్రామంలోని ప్రభుత్వ పాఠశాలను మంగళవారం ఎమ్మెల్యే కోరం కనకయ్య ఆకస్మికంగా తనిఖీ చేశారు. విద్యార్థులకు పౌష్టికాహారం, నిత్యం మెనూ అందిస్తున్నారా లేదా అని ఆరా తీశారు. మాట్లాడుతూ... పాఠశాల ప్రాంగణం ఎప్పటికప్పుడు పరిశుభ్రంగా ఉంచాలని ఉపాధ్యాయులకు సూచించారు. విద్యార్థులతో ముచ్చటించారు. బాగా చదువుకుని ఉన్నత శిఖరాలు అధిరోహించాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో కోరం సురేందర్, ఈది గణేష్, బద్రు, కానా, లక్ష్మీనారాయణ, రాములు పాల్గొన్నారు.

రెజ్లింగ్, కరాటే పోటీల్లో ప్రతిభ



విద్యార్థులను అభినందిస్తున్న ప్రిన్సిపాల్

సింగరేణి(కొత్తగూడెం): కొత్తగూడెంలో ఇటీవల నిర్వహించిన ఉమ్మడి జిల్లాస్థాయి రెజ్లింగ్, రాష్ట్ర స్థాయి కరాటే పోటీల్లో ధన్‌బాద్‌లోని సెయింట్ జోసఫ్ విద్యార్థులు పతకాలు సాధించారు. పాఠశాలకు చెందిన వి.హర్షవర్ధన్, అబ్దుల్ ఆయాన్, సీహెచ్.జైదీప్ పతకాలు సాధించగా ప్రిన్సిపాల్, ఉపాధ్యాయులు మంగళవారం అభినందించారు.

తుడుందెబ్బ మహాసభలను విజయవంతం చేయాలి

పాల్వంచరూరల్: కుమురం భీమ్ జిల్లా జోడే ఘాట్‌లో ఏప్రిల్ 7, 8, 9 తేదీల్లో జరగనున్న తుడుందెబ్బ రాష్ట్ర మహాసభలను విజయవంతం చేయాలని జిల్లా అధ్యక్షుడు సనప కోటేశ్వరరావు కోరారు. మండల పరిధి లక్ష్మీదేవిపల్లిలోని కుమురంభీమ్ భవనంలో మంగళవారం జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడారు. అటవీ, పెసా చట్టాలను పటిష్టంగా అమలు చేయాలని డిమాండ్ చేశారు.

బీఓబీ సేవలు వినియోగించుకోండి..

ఇల్లెందు: సింగరేణి సంస్థలో పని చేసే ఉద్యోగులు బ్యాంక్ ఆఫ్ బరోడా సేవలు వినియోగించుకోవాలని జీఎం వి.కృష్ణయ్య కోరారు. మంగళవారం ఇల్లెందులో మాట్లాడుతూ... శాలరీ అకౌంట్ ఉన్నవారికి ప్రమాద బీమా రూ.కోటి ఉంటుందన్నారు. యాక్సిడెంట్ డెత్ కవరేజీ, జీతం ఖాతాకు లింక్ చేయబడిన రూపే డెబిట్ కార్డుపై రూ.2 లక్షలు, శాశ్వతంగా వికలాంగుడు అయితే రూ.కోటి, తాత్కాలిక వికలాంగుడు అయితే రూ.75 లక్షలు ఉంటుందని, సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

మిర్చి సబ్ యార్డు సందర్శన

టేకులపల్లి: ఇల్లెందు వ్యవసాయ మార్కెట్ కమిటీ ఆధ్వర్యంలో టేకులపల్లి సబ్ యార్డులో కొనసాగుతున్న మిర్చి కొనుగోలు కేంద్రాన్ని జిల్లా మార్కెటింగ్ శాఖ అధికారి (డీఎంఓ) జాల నరేందర్ మంగళవారం ఆకస్మికంగా సందర్శించారు. మిర్చి నాణ్యతా ప్రమాణాలను పరిశీలించారు. కార్యదర్శి నరేష్ కుమార్, సూపర్‌వైజర్ శ్రీనివాస్‌రావు, ట్రేడర్లు ఉన్నారు.

టెండర్లు నిర్వహించండి..

ఇల్లెందురూరల్: తునికాకు టెండర్లు వెంటనే నిర్వహించడంతోపాటు మోడెం కొట్టించే పనులను ప్రారంభించాలని కోరుతూ మాస్‌లైన్ ఆధ్వర్యంలో మంగళవారం ఎఫ్‌డీఓ కార్యాలయంలో వినతిపత్రం అందజేశారు. మాజీ ఎమ్మెల్యే గుమ్మడి నర్సయ్య, నాయిని రాజు, బుర్ర వెంకన్న, బోసు, యాకూబ్‌షావలీ, ఆవుల కిరణ్, రామ్మూర్తి పాల్గొన్నారు.

బాలమేళా విజేత 'బొమ్మనపల్లి'



టేకులపల్లి: బహుమతి అందుకుంటున్న బొమ్మనపల్లి ప్రభుత్వ పాఠశాల ఉపాధ్యాయులు

టేకులపల్లి: బొమ్మనపల్లి జిల్లా పరిషత్ హైస్కూల్ కాంప్లెక్స్ స్థాయిలో జరిగిన బాలమేళాలో 13 పాఠశాలలు పాల్గొన్నాయి. కాంప్లెక్స్ స్థాయిలో మండల పరిషత్ ప్రభుత్వ ప్రాథమిక పాఠశాల బొమ్మనపల్లికి ప్రథమ స్థానం లభించింది. మంగళవారం బొమ్మనపల్లి హైస్కూల్‌లో జరిగిన ముగింపు కార్యక్రమంలో కాంప్లెక్స్ హెచ్ఎం మంగీలాల్, కార్యదర్శి రమేష్ బాబు చేతుల మీదుగా పాఠశాల హెచ్ఎం జ్యోతిరాణి, అసిస్టెంట్ పద్మ, ఐఆర్పీ టీచర్ నీరజ షారోన్‌కు బహుమతి అందజేశారు. అదే విధంగా ద్వితీయ చింతలంక, తృతీయ గోప్యాతండాలకు బహుమతులతో పాటు, తరగతుల వారీగా విజేతలకు బహుమతులను అందజేశారు. ఇండియన్ స్కౌట్ అండ్ గైడ్ ఫెలోషిప్ రాష్ట్ర కోఆర్డినేటర్ మహమ్మద్ ఖాసిం, భద్రాద్రి కొత్తగూడెం జిల్లా అధ్యక్షుడు లోగాని శ్రీనివాస్, వీరన్న, 13 పాఠశాలల హెడ్మాస్టర్లు, టీచర్లు పాల్గొన్నారు.

ఇల్లెందురూరల్: కొమరారం, సుభాష్‌నగర్ క్లస్టర్ల పరిధిలో మంగళవారం బాలమేళా కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ విద్యా సంవత్సరంలో విద్యార్థులకు ప్రయోగాత్మకంగా బోధించిన బోధన సామగ్రి, విద్యార్థుల చేత తయారు చేయించిన పలు రకాలైన పట్టికలను బాలమేళాలో ప్రదర్శించారు. ఆయా అంశాలపై విద్యార్థులు వివరించి ఆకట్టుకున్నారు. క్లస్టర్ పరిధిలోని వివిధ పాఠశాలల ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు బాలమేళాలో విద్యార్థుల ప్రతిభను అభినందించారు. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయులు సుధాకర్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.



ఇల్లెందురూరల్: బాలమేళాలో ఎగ్జిబిట్లను పరిశీలిస్తున్న ఉపాధ్యాయులు

మద్యం షాపులకు సీల్

టేకులపల్లి: 27న ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నిక నేపథ్యంలో మద్యం అమ్మకాలు నిలిచిపోయాయి. ఎన్నికల కోడ్ కారణంగా మంగళవారం సాయంత్రం టేకులపల్లిలోని నాలుగు మద్యం షాపులు, గోడౌన్‌కి ఇల్లెందు ఎక్సైజ్‌శాఖ అధికారులు సీల్ వేశారు. గురువారం సాయంత్రం 4 గంటల వరకు మద్యం అమ్మకాలు ఉండవని తెలిపారు. ఎవరైనా నిబంధలు ఉల్లంఘిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

విద్యార్థులు లక్ష్యాలు సాధించాలి



జ్యోతి ప్రజ్వలన చేస్తున్న డీఎస్పీ చంద్రభాను

ఇల్లెందు: విద్యార్థులు క్రమశిక్షణతో చదివి లక్ష్యాలు సాధించాలని, ఉన్నత శిఖరాలు అందుకోవాలని, తల్లిదండ్రులకు, గురువులకు పేరు ప్రతిష్టలు తీసుకు రావాలని ఇల్లెందు డీఎస్పీ ఎన్.చంద్రబాను, మున్సిపల్ కమిషనర్ శ్రీకాంత్, సాహితీ కళాశాల డైరెక్టర్ ఎంసీ నాగిరెడ్డి ఆకాంక్షించారు. మంగళవారం కళాశాలలో ఇంటర్ ద్వితీయ సంవత్సరం విద్యార్థులకు వీడ్కోలు సమావేశం జరిగింది. ఈ సందర్భంగా సరస్వతీ తల్లి చిత్రపటానికి పూలమాలలు వేసి జ్యోతి ప్రజ్వలన చేశారు. అనంతరం వారు మాట్లాడారు. ఈ కార్యక్రమంలో ప్రభుత్వ జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్ రామలింగేశ్వరావు, మార్గదర్శిని ఇంగ్లిష్ మీడియం హైస్కూల్ ప్రిన్సిపాల్ అర్వపల్లి రాధాకృష్ణ, కళాశాల ప్రిన్సిపాల్ గుజ్జర్లపూడి రాంబాబు, డైరెక్టర్లు ఎంసీ నాగిరెడ్డి, కేఎస్‌వీ సుధాకర్, ఎం.శ్రీనివాస్, అధ్యాపకులు పాల్గొన్నారు.

'మాయమాటలతో మభ్యపెడుతున్న ప్రభుత్వం'

జూలూరుపాడు: కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికలకు ముందు ఇచ్చిన హామీలను నెరవేర్చకుండా మాయ మాటలతో ఉద్యోగులు, ప్రజలను మభ్యపెడుతోందని బీజేపీ నాయకుడు గోలి మధుసూదన్‌రెడ్డి విమర్శించారు. ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికల్లో సరోత్తంరెడ్డిని గెలిపించాలని కోరుతూ మంగళవారం ఆయన పలు పాఠశాలల్లో ప్రచారం చేశారు. ఈ సందర్భంగా మధుసూదన్‌రెడ్డి మాట్లాడుతూ... గత బీఆర్‌ఎస్ ప్రభుత్వం, ప్రస్తుత కాంగ్రెస్ ప్రభుత్వం ఉద్యోగ, ఉపాధ్యాయుల సమస్యలపై నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నాయని ఆరోపించారు. ఈ మేరకు ఉపాధ్యాయుల పదోన్నతులు, పెండింగ్ డీఏల సాధన తదితర సమస్యల పరిష్కారానికి సరోత్తంరెడ్డిని గెలిపించాలని కోరారు. నాయకులు చిలుకూరి రమేష్, మాదినేని సతీష్, సిరిపురపు ప్రసాద్, భూక్యా రమేష్, పూరేటి శ్రీను, వెంకటేశ్వర్లు, సిరిపురపు గోపాల్‌రావు, పుల్లారావు, నర్వనేని కృష్ణ, వందనపు సుబ్బు పాల్గొన్నారు.

మొదటి ప్రాధాన్యత ఓటు వేయండి..

పాల్వంచ: ఈనెల 27న జరగనున్న ఎమ్మెల్సీ ఎన్నికల్లో ఉపాధ్యాయులు, అధ్యాపకులు అలుగుబెల్లి నర్సిరెడ్డికి మొదటి ప్రాధాన్యత ఓటు వేసి గెలిపించాలని టీఎస్‌యూటీఎఫ్ రాష్ట్ర కార్యదర్శి బి.రాజు, జిల్లా అధ్యక్షుడు బి.మురళీమోహన్ పిలుపునిచ్చారు. మంగళవారం స్థానిక ప్రెస్‌క్లబ్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడారు.

నర్సిరెడ్డి పీఆర్‌సీ కోసం, కాంట్రాక్ట్, ఔట్ సోర్సింగ్ ఉద్యోగులకు పీఆర్‌సీ వేతనాలు పెంచాలని కృషి చేశారన్నారు. విద్యా, ఉపాధ్యాయ సమస్యల పరిష్కారం అలుగుబెల్లి వల్లే సాధ్యమవుతుందన్నారు. ఎం.వెంకటేశ్వర్లు, ఎం.రామాచారి, ఎస్‌కె.పాషా, ఉమాదేవి, ఎ.విజయభాస్కర్, రామనాథం, టి.బాలు, ఎ.నర్సింహారావు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న రాజు

28న ప్రజా సంఘాల సదస్సు

ఇల్లెందు: కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన బడ్జెట్ అన్నిరంగాలకు అందనంత దూరంలో ఉందని, బడ్జెట్‌ను నిరసిస్తూ ఈ నెల 28న జరగనున్న ప్రజా సంఘాల సదస్సును విజయవంతం చేయాలని సీపీఎం నాయకులు కోరారు. మంగళవారం పార్టీ కార్యాలయంలో జిల్లా నాయకుడు ఎస్ఏ నబీ మాట్లాడుతూ... కార్మికులకు, ఉపాధి కూలీలకు, కర్షకులకు ఉపాధి చూపని బడ్జెట్‌ను కేంద్ర ప్రభుత్వం ప్రవేశ పెట్టిందన్నారు. బడ్జెట్ పూర్వాపరాలను క్లుప్తంగా తెలిపేందుకు సీఐటీయూ, తెలంగాణ వ్యవసాయ కార్మిక సంఘం, ఏఐకేఎస్ సంఘాల ఆధ్వర్యంలో ఇల్లెందులోని ఏలూరి భవన్‌లో సదస్సు ఏర్పాటు చేసినట్లు తెలిపారు. ఈ సమావేశంలో కృష్ణ, మోహన్‌రావు, కిరణ్, మరియ, ఫాతిమా, రాంబాయి, వెంకటమ్మ, ఉమాదేవి, పద్మ, లక్ష్మి, సత్యనారాయణ కోరీ పాల్గొన్నారు.

నష్టపోయిన రైతులను ఆదుకోండి..

టేకులపల్లి: పంట నష్టపోయిన రైతులను ప్రభుత్వం ఆదుకోవాలని ఐఎఫ్‌టీయూ రాష్ట్ర నాయకుడు డి.ప్రసాద్, సీపీఐ(ఎంఎల్) న్యూడెమోక్రసీ మండల కార్యదర్శి కల్తి వెంకటేశ్వర్లు, ఏఐకేఎంఎస్ జిల్లా నాయకుడు భూక్యా హర్య కోరారు. ఈ మేరకు మంగళవారం బాధిత రైతులతో కలిసి టేకులపల్లి సెంటర్ నుంచి ప్రదర్శనగా వెళ్లి వ్యవసాయ శాఖ కార్యాలయం ఎదుట ధర్నా నిర్వహించారు. ఏఓ అన్నపూర్ణకు వినతిపత్రం అందజేశారు. మాట్లాడుతూ... ఇటీవల కురిసిన అకాల వర్షం వలన టేకులపల్లి మండలంలోని పలు గ్రామాల్లో మొక్కజొన్న పంటకు తీవ్రంగా నష్టం జరిగిందని చెప్పారు. మొక్కుబడిగా కాకుండా సమగ్రంగా సర్వే నిర్వహించి నష్టపోయిన రైతులకు ఎకరానికి రూ.50వేల నష్ట పరిహారం చెల్లించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో ఎట్టి నరసింహారావు, గుగులోతు రామచందర్, భూక్యా నర్సింగ్, మేకల వినోద్, ధరావత్ వెంకన్న, బిచ్చ, బోడా మంగీలాల్, బానోతు వెంకట్రాం, రైతులు పాల్గొన్నారు.



ఎన్డీ, ఏఐకేఎంఎస్ ఆధ్వర్యంలో ధర్నా నిర్వహిస్తున్న రైతులు

క్షయ వ్యాధి నిర్మూలనకు కృషి చేయాలి



అవగాహన కల్పిస్తున్న డాక్టర్ రమేష్

సుజాతనగర్: క్షయ వ్యాధి నిర్మూలనకు అందరూ కృషి చేయాలని వైద్యాధికారి డాక్టర్ రమేష్ అన్నారు. క్షయ వ్యాధి నిర్మూలనా కార్యక్రమం నిక్షయ్ షివిర్‌లో భాగంగా సుజాతనగర్ ప్రభుత్వాస్పత్రి, సర్వారం ఉప ఆరోగ్య కేంద్రాలలో మంగళవారం ప్రజలకు అవగాహన కల్పించారు. డాక్టర్ రమేష్ మాట్లాడుతూ.. దేశవ్యాప్తంగా ఎంపిక చేసిన క్షయ వ్యాధి తీవ్రంగా ఉన్న 347 జిల్లాల్లో తెలంగాణ రాష్ట్రంలో తొమ్మిది జిల్లాలు ఉన్నాయని, అందులో భద్రాద్రి కొత్తగూడెం జిల్లా ఒకటని చెప్పారు. క్షయ వ్యాధిపై సమాజంలోని ప్రతీఒక్కరు చర్చించుకుని అవగాహన పెంచుకొని దానిని పూర్తిగా నిర్మూలించడంలో సహకరించాలని కోరారు. 15 రోజులకు మించి దగ్గు, జ్వరం ఆకలి లేకపోవడం, బరువు తగ్గిపోవడం, ఆయాసం, అలసట, తెమడలో రక్తం పడటం లక్షణాలు ఉన్నవారందరూ వంద రోజుల నిక్షయ్ షివిర్ కార్యక్రమంలో పాల్గొని ఉచిత క్షయ వ్యాధి నిర్ధారణ పరీక్షలు చేయించుకోవాలన్నారు. కార్యక్రమంలో హెచ్‌వీ పున్నమయ్య, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

'కాసాని' స్ఫూర్తితో ప్రజా ఉద్యమాలు

సింగరేణి(కొత్తగూడెం): సీపీఎం నాయకులు, అమరజీవి కాసాని ఐలయ్య సంస్మరణ సభ మార్చి 9న నిర్వహించనున్నామని ఆ పార్టీ రాష్ట్ర కార్యదర్శి పోతినేని సుదర్శన్ తెలిపారు. మంగళవారం కొత్తగూడెంలోని మంచికంటి భవన్‌లో జరిగిన జిల్లా విస్తృత స్థాయి సమావేశంలో మాట్లాడారు. నిరంతరం ప్రజల కోసం పరితపించిన వ్యక్తి కాసాని అని, ఉమ్మడి జిల్లాలో పార్టీ నిర్మాణానికి విశేషమైన కృషి చేశారని తెలిపారు. భవిష్యత్‌లో కాసాని స్ఫూర్తితో ప్రజా ఉద్యమాలు నిర్మించడానికి సంస్మరణ సభ నిర్వహిస్తున్నట్లు చెప్పారు. ఈ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని కోరారు.

సమస్యలను సీఎం దృష్టికి తీసుకెళ్లండి..

సింగరేణి(కొత్తగూడెం): సింగరేణి కాంట్రాక్ట్ కార్మికుల వేతనాలు పెంచాలని కోల్‌బెల్ట్ ఎమ్మెల్యేలకు, మంత్రులకు వినతిపత్రాలు అందజేయనున్నట్లు ప్రగతిశీల సింగరేణి కాంట్రాక్ట్ వర్కర్స్ యూనియన్ రాష్ట్ర అధ్యక్షుడు షేక్ యాకూబ్‌షావలీ అన్నారు. మంగళవారం కొత్తగూడెం పట్టణంలో నిర్వహించిన జూమ్ సమావేశంలో ఆయన మాట్లాడుతూ... ఈనెల 27, 28 తేదీలలో అసెంబ్లీ సమావేశాలు నిర్వహించనున్న నేపథ్యంలో కాంట్రాక్ట్ కార్మికుల సమస్యలను సీఎం దృష్టికి తీసుకెళ్లాలని ఎమ్మెల్యేలను కోరారు. సమావేశంలో తోకల రమేష్, ఆర్.మధుసూదన్‌రెడ్డి, పెద్దబోయిన సతీష్, సీవై పుల్లయ్య, ఎస్.శరత్, వెంకన్న పాల్గొన్నారు.

స్థానిక ఎన్నికలకు సిద్ధం కావాలి

ఇల్లెందు: త్వరలో స్థానిక సంస్థల ఎన్నికలు జరగనున్నాయని, ప్రతీ కార్యకర్త, నాయకులు సిద్ధం కావాలని సీపీఐ రాష్ట్ర సమితి సభ్యుడు కె.సారయ్య అన్నారు. మంగళవారం పట్టణ సమితి సమావేశం విఠల్‌రావు భవన్‌లో జరిగింది. మాట్లాడుతూ... కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన బడ్జెట్ పేదల నడ్డి విరిచిందన్నారు. కేంద్ర ప్రభుత్వరంగ సంస్థలను నిర్వీర్యం చేసిందని, కార్మిక చట్టాలను తుంగలో తొక్కిందని విమర్శించారు. పట్టణాల్లో పేదలు అనేక సమస్యలతో సతమతం అవుతున్నట్లు చెప్పారు. డి.శంకర్, బి.నాగయ్య, నజీర్ అహ్మద్, బాస శ్రీనివాసరావు పాల్గొన్నారు.

28న చలో ఢిల్లీ

జూలూరుపాడు: ఆర్ఎస్ఎస్, బీజేపీ కార్పొరేట్ విధానాలకు వ్యతిరేకంగా సీపీఐ(ఎంఎల్) మాస్‌లైన్ ప్రజాపంథా పార్టీ కేంద్ర కమిటీ ఆధ్వర్యంలో ఈనెల 28న నిర్వహించనున్న చలో ఢిల్లీ కార్యక్రమాన్ని జయప్రదం చేయాలని ఆ పార్టీ జిల్లా కార్యవర్గ సభ్యుడు జాటోత్ కృష్ణ పిలుపునిచ్చారు. ఈ మేరకు మంగళవారం జూలూరుపాడులో కరపత్రాలను ఆవిష్కరించారు. మాట్లాడుతూ.. ఆర్ఎస్ఎస్, బీజేపీ ఫెడరలిజంపై దాడి చేయడమే కాకుండా మతపరమైన విభజనకు అన్ని విధాలుగా ప్రోత్సహిస్తోందన్నారు. ప్రజలంతా ఐక్యమత్యంతో కార్పొరేట్ శక్తులకు వ్యతిరేకంగా పోరాడాలన్నారు.

ప్రిన్సిపాల్‌పై చర్యలు తీసుకోండి..

పాల్వంచరూరల్: స్థానిక పట్టణంలో ప్రైవేట్ స్కూల్ ప్రిన్సిపాల్ పిల్లలను వేధిస్తున్నారని, చర్యలు తీసుకోవాలని బీజేపీ నాయకులు డీఈఓ కార్యాలయంలో మంగళవారం వినతిపత్రం అందజేశారు. జీసీసీ కార్యాలయం సమీపంలోని ప్రైవేట్ స్కూల్ ప్రిన్సిపాల్ విద్యార్థులు యూనిఫాం వేసుకుని రాకుంటే గుంజీలు తీయిస్తున్నారని, ఫీజులు చెల్లించని విద్యార్థులను క్లాస్‌రూమ్‌లోకి రాకుండా తల్లిదండ్రులకు తెలియకుండా హింసిస్తున్నారని తెలిపారు. ప్రిన్సిపాల్‌పై కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.

నిబంధనలు పాటించని విద్యాసంస్థలు

కొత్తగూడెంఅర్బన్: నిబంధనలు పాటించని ప్రైవేటు, కార్పొరేట్ విద్యాసంస్థలపై చర్యలు తీసుకోవాలని కోరుతూ మంగళవారం పీడీఎస్‌యూ ఆధ్వర్యంలో జిల్లా ఇంటర్మీడియట్ నోడల్ ఆఫీసర్ వెంకటేశ్వరరావుకు వినతిపత్రం అందజేశారు. సంఘం రాష్ట్ర అధ్యక్షుడు పృథ్వీ మాట్లాడుతూ.. ఈ విద్యా సంవత్సరం ముగియకుండానే ప్రభుత్వ నిబంధనలు ఉల్లంఘిస్తూ అడ్మిషన్ల ప్రక్రియ ప్రారంభించారని చర్యలు తీసుకోవాలని కోరారు. శివప్రశాంత్, పార్థసారథి, తరుణ్ పాల్గొన్నారు.

త్రుటిలో తప్పిన ప్రమాదం

టేకులపల్లి: టేకులపల్లి పంచాయతీ కార్యాలయం వద్ద మంగళవారం ప్రధాన రహదారిపై వెళ్తున్న ఆటోపై చెట్టుకొమ్మ విరిగి పడింది. ఆటోలోని ఇద్దరు ప్రాణాలతో బయటపడటంతో త్రుటిలో ప్రమాదం తప్పింది. కొంతసేపు ట్రాఫిక్‌కు అంతరాయం ఏర్పడింది. సమాచారం తెలుసుకున్న పంచాయతీ కార్యదర్శి దీప్తి స్థానికుల సహకారంతో కొమ్మను తొలగించారు.

నాణ్యమైన ఆహారం అందించాలి

ఇల్లెందురూరల్: వసతిగృహాల్లో ఆహార నాణ్యతను మెరుగుపర్చే విధంగా చర్యలు తీసుకోవాలని కోరుతూ సీపీఎం నాయకులు మంగళవారం ఏటీడీఓ కార్యాలయంలో వినతిపత్రం అందజేశారు. వజ్జ సురేష్, ఖాదర్ తదితరులు పాల్గొన్నారు.

టీబీ పరీక్షలు చేయించుకోండి..

కొత్తగూడెంఅర్బన్: షుగర్ ఉన్నవారు తప్పని సరిగా టీబీ పరీక్షలు చేయించుకోవాలని డాక్టర్ రాము తెలిపారు. మంగళవారం రామవరంలోని సెవెన్ నెంబర్ బజార్‌లో టీబీ అవగాహన, హెల్త్ క్యాంపును అర్బన్ హెల్త్ సెంటర్ వారి ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. టీబీహెచ్‌వీ ఎం.కృష్ణవేణి, పీహెచ్ఎం శ్రీనివాసరావు, ఏఎన్ఎంలు పాల్గొన్నారు.

మహాశివరాత్రి పూజలకు సర్వం సిద్ధం

- ఆలయాల్లో అభిషేకం, కల్యాణానికి ఏర్పాట్లు
- భక్తుల కోసం ఏర్పాట్లు చేసిన నిర్వాహకులు

కొత్తగూడెంటౌన్: ఓం నమఃశివాయ అంటూ శివ నామస్మరణతో ఆలయాలు మార్మోగనున్నాయి. మహాశివరాత్రి పర్వదినం సందర్భంగా బుధవారం తెల్లవారుజాము నుంచి శివాలయాల్లో అభిషేకాలు మొదలవుతాయి. అలాగే, బుధవారం అర్ధరాత్రి స్వామి కల్యాణోత్సవానికి ఏర్పాట్లుచేశారు. ఈనేపథ్యాన వేలాదిగా తరలిరానున్న భక్తుల కోసం ఆలయ ఆవరణలో చలువ పందిళ్లు వేయించడంతో పాటు తాగునీరు, ఇతర వసతులు కల్పించారు. కాగా, కొత్తగూడెం రైటర్‌బస్తీలోని శ్రీమాతాశక్తి పంచాయతన క్షేత్రం ఆలయంలో శివపార్వతులకు ప్రతినిత్యం పూజలు జరుగుతుండగా, మహాశివరాత్రి వేడుకలు ఘనంగా నిర్వహించనున్నారు. అలాగే, కొత్తగూడెం బూడిదగడ్డ బస్తీలోని శివాలయంలో కూడా ప్రత్యేక పూజలకు వేలాదిగా భక్తులు తరలిరానున్నారు. ఈ మేరకు ఆలయాల్లో ప్రత్యేక పూజలు, ఉపవాసం ఉండే భక్తుల కసం ఏర్పాట్లు చేసినట్లు అర్చకులు ఇంద్రగంటి సత్యవరప్రసాద్, కొండపాక అభిరామాచార్యులు తెలిపారు.

ఇల్లెందు: ఇల్లెందు జేకే కాలనీలోని శ్రీ హరిహర క్షేత్రం, కూరగాయల మార్కెట్ సమీపాన శివాలయం, ఆంబజార్‌లోని శివాలయాలను మహాశివరాత్రి పూజలకు ముస్తాబు చేశారు. బుధవారం తెల్లారుజామునుంచే అభిషేకం, సాయంత్రం ఊరేగింపు, రాత్రి 11 గంటలకు కళ్యాణం జరగనున్నాయి. ఈమేరకు ఏర్పాట్లు పూర్తిచేసినట్లు ఆలయాల అర్చకులు, బాధ్యులు నరేష్‌కుమార్, నాగభూషణ శర్మ, గ్రంధె సదానందం, సూర్యప్రకాశరావు, రాఘవశర్మ తెలిపారు.



ఇల్లెందురూరల్: రేపల్లెవాడలో శివాలయం

ఇల్లెందు మండలంలో...

ఇల్లెందురూరల్: మహాశివరాత్రి పర్వదినాన్ని పురస్కరించుకుని ఇల్లెందు మండలంలోని శివాలయాల్లో ప్రత్యేక పూజలకు ఏర్పాట్లు చేశారు. రేపల్లెవాడ, తిలక్‌నగర్ పంచాయతీ పూసపల్లిలో స్వామివారి కల్యాణానికి పూజారులు, గ్రామపెద్దల ఆధ్వర్యాన ముస్తాబు చేశారు. సుమారు యాభై ఏళ్లుగా పూసపల్లిలో వీరభద్రుడి కల్యాణం నిర్వహించడం ఆనవాయితీగా వస్తోంది. ఈ మేరకు బుధవారం ఉదయం 9గంటలకు పూజలు మొదలవుతాయని ఆలయ ధర్మకర్త తెలమ సుగుణ తెలిపారు.

మ్యూజికల్ ప్రోగ్రాం..

మహా శివరాత్రి సందర్భంగా భక్తుల్లో భక్తి భావం, ఉత్సాహం నింపేందుకు, జాగారంలోనూ భక్తి పారవశ్యం చాటుకునేలా మ్యూజికల్ ప్రోగ్రాం నిర్వహిస్తున్నారు. పట్టణంలోని జేకే సింగరేణి హైస్కూల్ గ్రౌండ్‌లో ఈ కార్యక్రమం రాత్రి 7 గంటలకు ప్రారంభం అవుతుంది. ఈ కార్యక్రమంలో పట్టణంలోని భక్తులు ప్రజలు తరలి రావాలని ఉత్సవ కమిటీ కోరింది.



జూలూరుపాడు: పాపకొల్లు శివాలయంలో పూజలు నిర్వహిస్తున్న అర్చకులు

పూజలు ప్రారంభం

జూలూరుపాడు: పాపకొల్లు శ్రీ ఉమాసోమలింగేశ్వర స్వామి ఆలయంలో మూడు రోజులు జరగనున్న మహాశివరాత్రి పూజలు మంగళవారం ప్రారంభమయ్యాయి. తొలిరోజు తోరణాలంకారం, ధ్వజారోహణం, గణపతి పూజ, పుణ్యహవాచనం, దీక్షాధారణ, రక్షా బంధనం, కలశస్థాపన, అఖండ దీపారాధన నిర్వహించారు. శివపార్వతుల ఉత్సవ విగ్రహాలకు మంగళస్నానం చేయించారు. ఆలయ ప్రధాన అర్చకుడు మధుకుమార్ శర్మ మాట్లాడుతూ.. బుధవారం రాత్రి 10.30 గంటల నుంచి స్వామి వారి కల్యాణం జరగనున్నట్లు తెలిపారు.

విశ్వేశ్వరస్వామి ఆలయంలో..

పాల్వంచరూరల్: పెద్దమ్మతల్లి ఆలయ సముదాయంలోని శ్రీ అన్నపూర్ణా సమేత కాశీ విశ్వేశ్వర స్వామి ఆలయంలో మహాశివరాత్రి మహోత్సవాలను మంగళవారం ఈఓ రజనీకుమారి ప్రారంభించారు. ఖమ్మంకు చెందిన అవధానులు శివసంతోష్ శర్మ, రుత్వికులు గణపతి పూజ, రుద్రహోమం, అభిషేక పూజలు నిర్వహించారు. ఎండోమెంట్ శాఖ ఖమ్మం సహాయ కమిషనర్ ఎం.వీరస్వామి అమ్మవారిని దర్శించుకున్నారు.